క్లుప్తంగా

చర్చికి భూమి పూజ



మాచర్ల: పట్టణంలోని 9వ వార్డులో నూతనంగా జీవం గల దేవుని ప్రార్థనా మందిరం చర్చికి బుధవారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భూమి పూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి చర్చి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే నూతనంగా నిర్మాణమైన చర్చికి తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, కౌన్సిలర్లు జగన్నాథం శివయ్య, మందా సంతోష్, చర్చి పాస్టర్ వేముల వెంకటేశ్వర్లు, వార్డు బూత్ కన్వీనర్ నాగెండ్ల సత్యం, నాగెండ్ల నరేష్, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు రమావత్ బాలునాయక్, అగ్గిరాముడు, రవియాదవ్, మహిళలు భారీ స్థాయిలో పాల్గొని పీఆర్కేకు ఘన స్వాగతం పలికారు.

రబీ సాగుకు సబ్సిడీపై విత్తనాలు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మార్కొండారెడ్డి




మాచవరం: రబీ సాగు చేపట్టే రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి పేర్కొన్నారు. మాచవరం గ్రామ సచివాలయంలో ప్రస్తుత రైతాంగ సమస్యల-అవసరాలపై చర్చా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, రైతాంగానికి అవసరమయ్యే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చౌదరి సింగరయ్య మాట్లాడుతూ రైతులకు వ్యక్తిగతంగా టార్పాలిన్, సిల్పాలిన్ పట్టాలు, తైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై అందించాలని కోరారు. కృష్ణానదిపై లిఫ్టు ఇరిగేషన్ ద్వారా మండల రైతాంగానికి సాగునీరు అందించాలని విన్నవించారు. మండల వ్యవసాయ అధికారిణి కె.రామమ్మ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రాము, వట్టె రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన సమర్థంగా చేపట్టాలి



దాచేపల్లి : కులగణన సమర్థవంతంగా చేపట్టాలని తహసీల్దార్ జీ కరుణకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కులగణన కార్యక్రమం అన్ని గ్రామాల్లో చేపట్టాలని, కుటుంబ సభ్యులు, కులాల వారీగా సమాచారం సేకరించటం వలన ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఇబ్బందులు ఉండవనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీడీవో శోభారాణి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా విజయవంతం చేయాలని, ప్రతి సచివాలయం పరిధిలో 3 జట్లను ఎంపిక చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన వికసిత భారత సంకల్ప కార్యక్రమం కూడా విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జోషిబాబు, ఏవో పాపకుమారి, ఏఈ శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



దాచేపల్లి : గురజాల నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురజాలకు చెందిన కొమ్ము నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. స్థానిక దక్షిణగడ్డ ఏఈఎల్‌సీ చర్చిలో అసోసియేషన్ సభ్యుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడిగా మల్లా ఏలిషా, ప్రధాన కార్యదర్శిగా వర్లా ఆదాం, సహాయ కార్యదర్శిగా ఎం.జాన్‌పాల్, కోశాధికారిగా బి.మరియబాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జోజుకుమార్, తిమోతీ, డేవిడ్‌లను ఎన్నుకున్నారు. నియోజకవర్గంలో దేవుని సేవ చేస్తున్న పాస్టర్లకు ఇంటి స్థలం కేటాయించాలని, పాస్టర్లందరికి గౌరవ వేతనం అందించాలని నాగేశ్వరరావు కోరారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా జగన్ పాలన

మాచవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, నవరత్నాలు, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు, ఆర్బీకేలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య అన్నారు. మండలంలోని శ్రీరుక్మిణీపురం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా గ్రామానికి సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగింది కాబట్టే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరలా సీఎంగా జగన్ కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, ఈఓపీఆర్డీ వెంగళరావు, గ్రామ నాయకులు రామారావు, కృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి జగనన్న కావాలి

వెల్దుర్తి: ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా కావాలని మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య అన్నారు. బుధవారం మండాది గ్రామంలో గడప గడపకు తిరిగి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించి మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని పోల్చి చూసి అభివృద్ధి చేసిన వారికి మద్దతివ్వాలని కోరారు. సీఎం జగన్ ప్రజలకు మేలు చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జెడ్పీటీసీ సభ్యుడు కేతావత్ రూప్లీ బాలునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కోట్ల పాపిరెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ శీలం సైదారెడ్డి, ఎంపీటీసీ కాంతారావు, జేసీఎస్ మండల కన్వీనర్ బొజ్జా అంజిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణ, ఆంజనేయులు, చిన మల్లారెడ్డి, లింగారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, వెంగళరెడ్డి, చిన సైదారెడ్డి, కిషోర్, గాలయ్య, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



రెంటచింతలలో ప్రచార కిట్లతో సర్పంచ్, ఎంపీపీ, నేతలు, వలంటీర్లు

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన

కారెంపూడి: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి కారెంపూడిలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. గ్రామ సచివాలయం 1లో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సమావేశమై సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మండల జేసీఎస్ కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సభా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీపీ శారదా శ్రీనివాసరెడ్డిలు, వైస్ ఎంపీపీ అల్లయ్యసావిత్రిలు మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల వద్దకు వెళ్లడానికి భయపడేదని కానీ జగనన్న మాత్రం ఇచ్చిన ఎన్నికల హామీలలో 99 శాతం నెరవేర్చి ప్రజల వద్దకు పార్టీ నాయకులు ధైర్యంగా వెళ్లి మీకు ఇది చేశాం అని ప్రజలకు చెప్పుకునే పరిస్థితి కల్పించారన్నారు. గాంధీ బొమ్మ సెంటర్‌లోని ఆర్యవైశ్య వీధిలో గడపలకు వెళ్లి ప్రజలకు ఇప్పటి వరకు చేసిన మేలును వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ కరదీపికలను అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీలాభాయితేజానాయక్, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి కె.చంద్రశేఖర్, ఎంపీటీసీలు షేక్ ఆరిఫ్, ఏసోబు, పద్మలింగయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి

రెంటచింతల: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అవసరం ఎందుకు కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలతో ఇంటింటికి వెళ్లి ఎంత మేలు జరిగిందో నాయకులు వివరించాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం రెంటచింతల గ్రామ సచివాలయం-2 వద్ద ఆమె సర్పంచ్ పేర్ల చౌడమ్మ, పార్టీ నాయకులతో కలిసి వలంటీర్లకు ప్రచార కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పార్టీ నేతలతో కలిసి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలన్నారు. ముందుగా వైఎస్సార్ సీపీ జండాను ఎగురవేశారు. మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, పార్టీ నేతలు ముత్తయ్య, ప్రతాప్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, తిరుపతిరావు, బ్రహ్మారెడ్డి, బంగారురెడ్డి, నారపరెడ్డి, సంసోన్, వలి పాల్గొన్నారు.



మండాదిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



రెంటచింతలలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ చౌడమ్మ, ఎంపీపీ చౌడేశ్వరి



ప్రజల మద్దతు కూడగట్టేందుకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



విజయపురిసౌత్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధి జరిగిందని మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి అన్నారు. బుధవారం మాచర్ల మండలంలోని నాగులవరం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి గడపకు ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పథకాల లబ్ధి వివరాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ బూడిద మంగమ్మ తనయుడు శ్రీనివాసరావు, సర్పంచ్ గోగిరెడ్డి వెంకట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, మాచర్ల జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పి.వెంకట్రామయ్య, కంభంపాడు గ్రామ పెద్ద ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, ఉప సర్పంచ్ అన్నెమ్మ రాములు, గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



జాస్మిన్‌కు చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలిచే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని అడిగొప్పల గ్రామానికి చెందిన సయ్యద్ జాస్మిన్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ నెల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాచర్ల పర్యటన సందర్భంగా బాలిక జాస్మిన్ కుటుంబసభ్యులు పీఆర్కే చొరవతో సీఎం జగన్‌ని కలిసి తలసేమియా వ్యాధి వలన ఆర్థికంగా కుటుంబం ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం జగన్ తక్షణ సహాయంగా లక్ష చెక్కును అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ సయ్యద్ జాస్మిన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి సర్జరీకి కావాల్సిన రూ.25 లక్షల నిధులను త్వరలో అందించేలా కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు. అడిగొప్పల సర్పంచ్ నలబోతుల చిన్నబ్బాయి, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ నాగుల్ మీరా, పలువురు పాల్గొన్నారు.


ఇన్నోవా, ద్విచక్ర వాహనం ఢీ

వెల్దుర్తి: ఇన్నోవా, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు వద్ద బుధవారం జరిగింది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన షేక్ చిన సైదా (50) గ్రామం నుంచి వెల్దుర్తి వైపు పొలం పనులకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాచర్ల నుంచి యర్రగొండపాలెం వెళ్తున్న ఇన్నోవా ఢీ కొనడంతో చిన సైదా అక్కడికక్కడే మృతి చెందాడు. చిన సైదా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య హుస్సేన్ బి ఫిర్యాదు మేరకు వెల్దుర్తి ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైస్ చైర్మన్ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

గురజాల : నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ ఇంటిపై మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు థమ్స్ అప్ సీసాలు ఇంటిపైకి విసిరి వేయడంతో ఇంటి అద్దాలు పగిలిపోయాయి. బడేజానీ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలి



నకరికల్లు: రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిలింగం అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో బుధవారం రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం మానవహక్కులను కాపాడుతుందని అన్నారు. విద్యార్థి దశ నుంచే రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకుంటే జీవితంలో ఉన్నత పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థినులకు రాజ్యాంగం ఆమోదం, ప్రవేశిక అను అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

దుర్గి మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కె.దుర్గా ప్రసాద్



ఈ రాంబాబు

దుర్గి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం యూటీఎఫ్ ప్రాంతీయ కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ హాజరయ్యారు. జిల్లా కార్యదర్శులు శ్రీనివాసరావు, నాసర్‌రెడ్డి, ఆయేషా సుల్తానా సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా కె.దుర్గా ప్రసాద్, గౌరవాధ్యక్షులుగా ఎస్.రాధాకృష్ణమూర్తి, సహాధ్యక్షులుగా ఆర్.అమరలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఈ రాంబాబు, కోశాధికారిగా ఎం.రంగయ్య, జిల్లా కౌన్సిలర్‌గా వై ఏడుకొండలు, టి.శ్రీనివాసరావు, ఎ.రమేష్, కె.రాధికలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

కన్నుల పండువగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

రెంటాల(రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామంలో రచ్చబండ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం పలువురు వేద పండితుల చేతులమీదుగా కన్నుల పండువగా జరిపించారు. ఉదయం 7 గంటలకు మారేపల్లి వెంకట రమణాచార్యులు, పూరిమెట్ల శేషభట్టాచార్యులు, గొట్టిపాళ్ల కృష్ణామాచార్యులు, మోహన్‌శర్మ, ఎస్.నారాయణచార్యులు నేతృత్వంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనము, మండపారాధన, పంచామృతాభిషేకాలు, వాస్తుపూజ, వాస్తు హోమాలు నిర్వహించారు. ఉదయం గం.11.02 ని.లకు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో కనులపండువగా జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రభుత్వవిప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే

రైతుల సహకారంతోనే భూ రీసర్వే వేగవంతం

ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

రెంటచింతల: ఎన్నో దశాబ్దాల నుంచి నెలకొన్న భూ వివాదాలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేకు వచ్చిన సర్వే బృందాలకు రైతులు సహకరించినప్పుడే సర్వే వేగవంతం అవుతుందని గురజాల ఆర్డీవో గాజుపల్లి వెంకట రమణ కాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రెంటాల గ్రామంలో చేపట్టిన 3,920 ఎకరాల భూ రీసర్వే భూములను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేసి మాట్లాడారు. సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం 100 సంవత్సరాల అనంతరం ఈ సమగ్ర భూ రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. ఎంతో కాలంగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించడమే లక్ష్యంగా ఓఆర్ఐ మ్యాప్ ఆధారంగా చేపట్టిన ఈ భూ రీసర్వేను సర్వే బృందాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులు రీసర్వే బృందాలకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో దామరపాడుకు చెందిన 1,127 ఎకరాలు, మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన 3,124 ఎకరాల భూముల రీసర్వే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జయరాజు, మండల సర్వేయర్ తోట సుధాకర్, గ్రామ వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రెంటాల భూరీసర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న గురజాల ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి

వరి పంటలో కేళీలను గుర్తించి ఏరివేయాలి

వ్యవసాయ ఉప సంచాలకులు శివకుమారి


అచ్చంపేట: వరి పంటలో కేళీలను గుర్తించి ఏరివేయాలని, తెగుళ్ల నివారణకు ప్రొపికొనజోల్ 2ఎంఎల్ లీటరు నీటిలో కలపి పిచికారీ చేయాలని వ్యవసాయ ఉప సంచాలకులు ఎం.శివకుమారి రైతులకు సూచించారు. మండలంలోని తాడువాయి, చల్లగరిగ గ్రామాలలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వరి, మిరప పంటలను పరిశీలించి అధిక దిగుబడులకు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి.రమేష్ మిరప పంటలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. మిరప పంట ప్రారంభ దశలో భాస్వరం వాడటం వల్ల ఉపయోగం ఉండదని, అనవసర ఖర్చులు పెంచుకోవద్దని సూచించారు. క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు తెగుళ్లను యాజమాన్య పద్ధతుల ద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవీ పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణాధికారులు శివానాయక్, లక్ష్మీశైలజ, మన్యనాయక్, రహీమ్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



తాడువాయిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులు సస్యరక్షణ చేపట్టాలి

రెంటచింతల: ఆరుగాలం కష్టించి రెక్కలు ముక్కలు చేసుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న మిర్చి పంటకు బొబ్బర తెగులు, నల్ల తామర పురుగు, తెల్ల నల్లి, తెల్లదోమ, పేనుబంక సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని గురజాల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. బుధవారం రెంటచింతల, మిట్టగుడిపాడు, రెంటాల, పశర్లపాడు, పాలువాయి తదితర గ్రామాలలో బొబ్బర తెగులు (జెమినీ వైరస్), నల్ల తామర పురుగు నివారణపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఆయా గ్రామాలలో మిర్చితోటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. మంచు కురిసే సమయంలో మిర్చి తోటలలో రసం పీల్చు పురుగులు ఉధృతంగా ఉంటే జెమినీ వైరస్ సోకుతుందన్నారు. ఈ తెగులు వ్యాప్తిస్తే పంట పెరుగుదల నిలిచిపోయి, దిగుబడి ఎకరాకు 50 శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు. తెల్లదోమ నివారణకు పొలం చుట్టూ జొన్న, మొక్కజొన్నను 2, 3 సాళ్ళు వేసుకోవాలన్నారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి 19-19-19 గమ్తో కలిపి ఎకరాకు ఒక కేజీ స్ప్రే చేయాలన్నారు. ప్రతి 20 రోజులకు ఒక సారి ఎకరాకు అరకేజీ ఫార్ములా-6 పిచికారీ చేసిన సూక్ష్మపోషకాల లోపాన్ని నివారించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు నందిని, తిరుపతినాయక్, లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మిర్చితోటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్

విద్యార్థులకు టీటీ వ్యాక్సినేషన్



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టీటీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 96 మంది విద్యార్థులకు స్థానిక విలేజ్ క్లినిక్ నర్సింగ్ సిబ్బంది టీటీ వ్యాక్సిన్ అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సరోజిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.రాజశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సువార్త స్వస్థత సభ

దాచేపల్లి : మండలంలోని రామాపురంలో సువార్త స్వస్థత సభ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాస్టర్ మోషే బుధవారం తెలిపారు. ఈ సభలో ముఖ్య ప్రసంగీకులుగా హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు బ్రదర్ అబ్రహాం పాల్గొంటారని, పల్నాడు ప్రాంతంలోని క్రైస్తవ విశ్వాసులు పాల్గొనాలని కోరారు.